# అల్లాకే ఫకీర్

## (1)

జైసూల్ ఐ నిరుద్దీన్ రాజ్యానికి వచ్చాడు. అతడు రాజ్యానికి రావటం లోకమంతా వాంఛించినది. ఎందుకంటే అతడు యువరాజుగా ఉన్నప్పుడు మంచి దైవభక్తుడుగా కనిపించాడు. పేదవాళ్లకు ఉపకారం చేశాడు. అమిత జాలిగుండె వాడని పేరు పొందాడు. ఒకసారి అతను నాల్గు గుఱ్ఱాలబండి మీద పోతుంటే ఒక కుక్క దాని క్రిందపడి "కంయి" అని మొత్తుకుంది. అతడు బండి ఆపించి దిగి దాన్ని చూచి జాలి పొంది దానికి వైద్యము చేయించాడు. ఉత్తరత్ర అది చస్తే దానికి పెద్ద సమాధి కట్టించాడు. ఇది ఖిల్లా బజారులో జరిగింది. జనం గుంపులు గుంపులై చూశారు. ఇదివరకు నవాబులు అట్లా మనుష్యులు పడిచచ్చినా లెక్క చేసేవాళ్ళు కారు.

అతడు మహమ్మదు అవతారం అన్నారు. అతడు విద్యాపోషకుడు, కవి పండిత పక్షపాతి అన్నారు. ఎప్పుడూ కవులు వ్రాత కాపీలు పుచ్చుకొని యువరాజు సౌధం చుట్టూ మూగేవారు. ఆయన కొందరు కవులను గౌరవించేవాడు. అందరూ ఆయనకన్న రసజ్ఞులు లేరన్నారు. ఆయన రాజ్యానికి వచ్చాడంటే జనం యెందుకు సంతోషించరు? ఆయనలో కొంత క్రూరత్వం వుందన్నారు. ఈ మాటలెవ్వరూ విశ్వసించలేదు. అక్కడక్కడ కొందరు చెదురుగా ఆయన్ని పరమరాక్షసుడన్నారు. ఆమాట లెవ్వరూ వినిపించుకోలేదు. ఈ మాటలు బాగా ఎవరన్నా వింటే 'అన్నవానికి వెంటనే శాస్తి అవుతూ' వచ్చింది.

## (2)

జైసూల్ రాజ్యానికి వచ్చిన మొదటి యేడాదిలో అతను దేశానికి చాలా లాభం చేశాడు. తలపన్ను తీయించాడు. జనం ఆయన్ని అవతారపురుషుడన్నారు. తురకలు మహమ్మదు అంటే, హిందువులు రాముడన్నారు. కొన్ని చెఱువులకు కట్టలు పోయించాడు. కొన్ని బాటలకు వంతెనలు కట్టించాడు. బేగీరావు టపా పెట్టింది అతనే. భూలోకం స్వర్గసుఖంగా పోతుందన్నారు. కల్పవృక్షమూ, కామధేనువూ రెండూ అబద్ధం – నిరుద్దీన్ ఒక్కటే నిజమన్నారు.

జైసూల్ ఒకరోజు సాయంత్రం దౌలత్‌మహల్‌లో పై అంతస్తు మీద బంగారపు కోళ్ళు, రతనపు పని కల దంతపు మంచంమీద పడుకున్నాడు. అచ్చు బంగారపునక్కీ, అంచు మరకతాలూ, పవడాలూ ఎడమెడముగా పొదిగినట్లు పనిచేసిన ముఖమల్ దుప్పటి పఱుపుల మీద వేసి వున్నది. షాహి పడుకున్నది. దానిమీద. రెండంతస్తుల క్రింద నుంచి దౌలత్‌మహల్ కాళ్లకి తగుల్తూ పోతూ వున్న యమునా నదిపై ప్రవాహాలు మీది నుంచి వెళ్ళేగాలి జైసూల్ కళ్ళల్లోకి కొడుతోంది. దుప్పటి నక్కీ అంచు ఎగిరి జైసూల్ కళ్ళకి నీరాజనమిస్తోంది. యమునానది తన నల్లని ఛాయ ఒక తేజోలేశంగా పైకెగరగొట్టి షాహి యౌవనచిహ్నమైన గడ్డంతో సరాగమాడుతోంది.

అప్పుడు విదియ చంద్రుడు క్రుంకబోతున్నాడు. నిరుద్దీన్ మనస్సులోకి ఏదో ఒక వూహ వచ్చింది. అతడు వెంటనే సేవకుణ్ణి పిలిపించి మంత్రికి కబురంపించాడు. మంత్రితో ఒక మాట చెప్పాడు.

**(3)**

తరువాత వారం రోజులకు రాజధానికి యేబదిమైళ్ళ దూరంలో ఉన్న ఒక పట్టణం నుంచి ఒక చిన్న జాగీరుదారు తన కుటుంబంతో రాజధానికి వచ్చాడు. మొదట రెండు మూడు నెలలు మిక్కిలి గౌరవం పొందాడు. ఆ జాగీరుదారు పేరు రామసింగ్. ఆ రామసింగునకు తరువాత యేదో అనుమానం పుట్టింది. సంవత్సరం గడిచింది. రామసింగు ఒకరోజున హఠాత్తుగా ఒక సంగతి తెలుసుకున్నాడు. తన జాగీరంతా షాహీ కాజేశాడని, షాహితో పోయి మెఱపెట్టుకున్నాడు. షాహి అరమోడ్పు కన్నులతో రామసింగు దీనాలాపములు విన్నాడు. మంత్రులన్నారు గదా, "జగత్ప్రభువు, దయామయుడు, నిరుద్దీన్ పాదుషాకి నీ జాగీరెందుకు? ఏదో కొంత వ్యవహారం కొఱకు తీసుకున్నాడు గాని, నీ జాగీరు నీకే యిచ్చేస్తాడు" అని

ఐదు ఆఱునెలలు గడిచింది. ఇప్పుడు రామసింగు తిన తిండిలేదు. కట్ట గుడ్డలేదు. ఆ నవాబు విడిదిలో వుంటున్నాడు. జాగీరు వున్నప్పటి జవాహిరి, ముఖమల్ గుడ్డలు, పట్టుగుడ్డలు బైటికి తీసి వాడుకుంటున్నాడు. రోజూ, షాహి దర్శనానికి వెళతాడు. షాహి దర్శనం లేదు. తిరిగి వస్తాడు. బంగారపు గిండులు, వెండి పళ్ళెములు, జరీశాలువలు అమ్మకం అయిపోతున్నవి. తిండికి పెటపెటలాడుతున్నాడు.

**(4)**

మళ్ళీ ఆఱునెలలు అయిన తరువాత, రామసింగు కింకో విషయం తెలిసింది. రామసింగు భార్య షాహి అంతఃపురంలో వున్నది. ఎట్లా వెళ్ళిందో తెలియదు. తానింట్లో లేనప్పుడు షాహిరౌతులు వచ్చి బలవంతంగా మేనాలో ఎక్కించుకొని తీసుకుపోయారని యిరుగు పొరుగువాళ్ళు చెప్పారు. కొందరు ఆవిడకు యిష్టమై వెళ్ళిందన్నారు. కొందరు నవాబుకీ ఆవిడకీ సంబంధం రెండేండ్ల బట్టీ వున్నది- ఇది క్రొత్తయేమిటన్నారు. రామసింగు ఒళ్ళు అదివఱకే దారిద్ర్యమనే గ్రీష్మాతపం చేత యెండుకట్టె అయింది. ఇప్పుడు నిప్పుపుల్ల తగుల్కొనేసరికి భగా భగా మండింది. రామసింగు కాగడా, కొరివీగాని స్థితిలో పహరాలు దూసుకొని షాహి యెదుట నిలబడ్డాడు. షాహి చుట్టూ నవాబులు, ఉమ్రావులు, కవులు, సామంతులు ఉన్నారు.

ఒకడు సర్వభారత క్షోణీమండలాధిపుడన్నాడు. ఒకడు సామంతనృప మౌళిమణి మండిత పాద నఖదీప్తి అన్నాడు. మఱొకడు కవిలోక దీనజన చింతామణి అన్నాడు. ఆ మధ్య రామసింగు షాహిని కర్కోటకుడన్నాడు. గోముఖవ్యాఘ్రు డన్నాడు. నమక్‌హరామ్ అన్నాడు. ఔరత్ కా ధాకూ అన్నాడు. నలుగురూ నవ్వారు. షాహి పెదవులలో నవ్వేడు. కన్నులలో నిప్పులు క్రక్కాడు. ఉమ్రావులు, కవులు అతని కనులు ఇంద్రనీలపు మణులవడం చేత కొరివిగా వున్న రామసింగు ఆ కన్నులలో ప్రతిఫలించి ఆ కళ్ళు అట్లా కనిపించాయేకాని, హిమానీబిందు తిరస్కారులైన ఆ కళ్ళల్లో అసలు నిప్పులెట్లా వుంటాయని అన్నారు. వృధాగా మొఱిగి మొఱిగి రామసింగు బయటపడ్డాడు. అందరూ రామసింగును ఖైదు చేయాలన్నారు. షాహి కూడదని వదలిపెట్టించాడు.

**(5)**

రామసింగు అప్పుడప్పుడు పిచ్చివాడుగా వీధుల్లో కనబడతాడన్నారు కొందరు. చాలామంది మేము చూశామంటే మేము చూశామన్నారు. ఆ మహాపురుషుడైన షాహికి ఈ వెధవ జోలి పట్టిందా? అన్నారు. ఇతర వూళ్ళనుంచి కొందరు ఉమ్రావులు రామసింగును తమ ఊళ్లో చూశామన్నారు. కొందరు ఉమ్రావులు రామసింగు తమ వూళ్ళో ఉన్నాడని, అతడెప్పుడు షాహిని తిడుతున్నాడని, తామతన్ని ఖైదు చేసేవారే గాని షాహి కిష్టములేని పని

చెయ్యడమెందుకని మానివేశామని చెప్పారు. షాహి కొలువులో రామసింగు పేరు కొన్నాళ్ళు నవ్వులాటలైంది. మరి షాహి అంటే దేవుడే అనుకున్న వాళ్ళకి కోపహేతువైంది.

**(6)**

నిజంగా రామసింగు కోటలో ఒకమూల ఒక చీకటి కొట్టులో పడియున్నాడు. కొరివి కాకుండా కాగడా కాకుండా షాహి యెదుటికి వెళ్ళి, పొగచూరుతూ మండుతూ యేరోజున నిలబడ్డాడో, బహిరంగమైన సభలో దయామయుడైన ఆ షాహి చేత ఏనాడు వదలిపెట్టబడ్డాడో, ఆ రోజున రాత్రే రామసింగు ఈ కోటలోని చీకటి కొట్లోకి చేరాడు. షాహి ప్రతి సోమవారం రాజకార్యాలు చేయడు. ఆరోజున ప్రొద్దున్నే రామసింగు వున్న చీకటికొట్టు దగ్గరికి వెళతాడు. రామసింగుని బయటకు తెప్పిస్తాడు. "ఏమిరా! నీకేమి అపకారం చేశాను?" అంటాడు. రామసింగు షాహిని వందలు, వేలు, లక్షలు, కోట్లు తిడతాడు. "ఒరేయ్! నీవు షాహివా? నీవు పశువవు. నీవు నమక్‌హరామ్‌వి. నీవు గాడిదవు. దైవం నీకు రాజ్యమిచ్చాడు. నీకు బుద్ధిలేదు. అధికారం వుంది కదా యని అడుగుతున్నావు. ఎప్పుడిలా రాయల్లే బ్రతికి వుండవు. చస్తావు. నా ఉసురు తగిలి పోతావు" అంటాడు. సిద్దీవాళ్ళు, ఖొజ్జా వాళ్ళు కొరడాలు పుచ్చుకొని రామసింగుని కొడతారు. స్పృహ చెడిపడిపోయే వఱకూ రామసింగు తిడతాడు. వాణ్ణి ఖైదులో వేస్తారు.

ఇట్లా అనేక సోమవారాలు గడిచినవి. ఒక సోమవారం ప్రొద్దున్నే షాహి వచ్చాడు. అప్పటికి సోమవారాలు కొన్ని వందలైనవి. ఏ సోమవారమూ కూడా రామసింగుకి బుద్ధి తెప్పించలేదేమి? షాహికి చాలా కోపం వచ్చింది. సోమవారం అన్నపేరు, రామసింగు అన్నపేరు ఇవి రెండూ షాహి ప్రాణాలమీద కూర్చున్నవి.

రామసింగన్నా తుడుచుకుపోవాలి. సోమవారమన్నా తుడుచుకుపోవాలి. షాహి పండితుల్ని పిలిపించి సోమవారాన్ని బర్తరఫ్ చెయ్యమన్నాడు. వాళ్ళు "ఆదివారం సోమవారం కలసి ఒక్కటే. మొదటిది పెద్ద ఆదివారం. రెండోది చిన్న ఆదివారం" అన్నారు. లోకంలో అల్లా ప్రచారం సాగింది. ఈ సోమవారం పల్లెటూళ్ళల్లో పోయి దాక్కుంది. పూర్తిగా చచ్చింది కాదు. చిన్న ఆదివారానికి వ్యాకరణం మాదిరి స్థానివద్భావం పట్టింది. అది పేరుకి చిన్నాదివారమైనా ఆ సోమవార మల్లే పని చెయ్యడం మొదలుపెట్టింది.

షాహికి తెలిసింది. రామసింగు పోవలసిందే కాని సోమవారం పోదని, కొరడా తాను స్వయంగా చేత్తో పుచ్చుకు వెళ్ళాడు రామసింగు దగ్గరకు

"ఏమిరా యింకా అంటావా?"

"నా గొంతులో ప్రాణమున్నంత వరకంటాను. నీవు రాక్షసుడవు. పిశాచానివి, దయ్యానివి."

చుఱకత్తులు గ్రుచ్చిన కొరడాచివళ్ళు కాళ్ళకూ, చేతులకూ సంకెళ్ళు వున్న రామసింగు వీపు మీద నెత్తిమీద ఛడేల్ ఛడేల్‌మని పడ్డవి.

"ఇంకా అంటావా?"

"అంటాను. నా నోటివెంట మాట వచ్చేవరకూ అంటాను. నీవు గాడిదవు. పందివి, నీకు నీతిలేదు, జాతిలేదు, నీ ముఖాన ఉమ్మి వేయవలె!"

షాహి చేతిలో నున్న కొరడా రామసింగు మెడకు ఉరిపోసాడు. బిగించాడు. ఇనుప బొడిపెలు కలిగిన చెప్పులతో షాహి రామసింగు ఆయములలో పొడిచాడు. రామసింగుకి ఊపిరాడలేదు. షాహి మళ్ళీ అన్నాడు. "ఏమిరా! యింకా అంటావా?"

రామసింగు పెదవుల సందునుంచి మాటకాని మాట పెదవుల కదలికను బట్టి గ్రహించవలసిన మాట వచ్చింది. "నీవు నమక్ హరామ్! ఔరత్ కా డాకూ!"

**(7)**

తరువాత వారం రోజులు ఒకటే సోమవారం! అప్పటికి మళ్ళీ సోమవారం చిన్న ఆదివారం గాకుండా సోమవారంగా వచ్చింది. షాహి పెద్ద సభ తీర్చాడు. ఉమ్రావులు రాజాధిరాజు, రాజపరమేశ్వరుడన్నా రతన్ని, సామంతులు అల్పనృప చంద్రమః కిరణదాత అన్నారతన్ని. కవులు దయానిధి, కరుణాసాగరుడు అన్నారు. అప్పుడే ఒక శుభవార్త వచ్చింది. ఢిల్లీ నుండి మక్కాకు, రామేశ్వరము నుండి కాశీకి తీర్థయాత్రికులకు షాహి రోడ్లు వేయించి ప్రక్కన చెట్లు వేయించాడు. లోకబంధువు! జగదుద్ధారకుడు!! మహాదైవభక్తి పరాయణుడు!!! అల్లాకే ఫకీరు! ! ! !